# రాంగ్ నంబర్



'హలో'

తలొంచుకొని రోడ్డుమీద నడుస్తున్న నేను ఆ పిలుపుకు వెనుదిరిగి చూశాను. ఆ యువకుడు పిలుస్తున్నది నన్నేనని అర్థం చేసుకోవడానికి నాకు ఓ అరక్షణం పట్టింది. అతనెవరో గుర్తుకు తెచ్చుకోవడానికి నేను చేస్తున్న ప్రయత్నానికి అతను అడ్డు తగుల్తూ, 'ఏంటీ, నన్ను పూర్తిగా మరచి పోయావా? అవున్లే? మాలాంటి వాళ్ళం ఏం గుర్తుంటాం' అంటూ నిష్ఠూరాలు మొదలు పెట్టాడు. వెంటనే నా క్వొశ్చెన్ మార్కు మొహానికి కాస్తంత నవ్వు పులుముకొని 'హల్లో, బాగున్నావా?' వీణ్ణి ఇంతకు ముందు ఒరేయ్! అని చనువుగా పిలిచేవాణ్ణో లేదో గుర్తొచ్చి చావక మామూలుగానే పలుకరించా. 'ఏమిటఈ విషేశాలు? అయినా, అదేం మాట, నేను నిన్ను గుర్తు పట్టకపోవడమేమిటి? అసలు మర్చిపోతే గదా, గుర్తు తెచ్చుకోవడానికి?' అంటూ తెలివిగా ఎదురు ప్రశ్న వేశాననుకొని సంతోషపడిపోయానే తప్ప అతగాడు మాత్రం గుర్తుకు రావడం లేదు.

సైకిల్ నడిపించుకుంటూ నాప్రక్కనే నడుస్తున్నాడు. ఇంతకీ తాడికొండ రెసిడెన్షియల్ స్కూల్‌వాడా, గంగవరం ఎస్వీకె హైస్కూలులో చదివాడా, చీరాల కాలేజీలో చదివాడా? హైద్రాబాద్‌లో ఐ.సి.డబ్ల్యు.ఏ లో క్లాస్‌మేటా? మొత్తానికి ఎక్కడో కలిసి చదివుంటాడని అనిపిస్తోంది. చివరిది కాకపోవచ్చునని కూడా చూచాయగా తెలుస్తూనే ఉంది. అది అయిదారేళ్ళ క్రితమే కాబట్టి.

నేను మౌనంగా ఉండడం గమనించి ఏదైనా మాట్లాడుదామనే ఉద్దేశ్యంతో అతడే సంభాషణలు మొదలు పెట్టాడు. 'ఆ తర్వాత ఎక్కడ చదివావ్?' అంటూ సుదీర్ఘ సంభాషణకు శ్రీకారం చుట్టే ప్రయత్నం చేయడంతో నాకు భయమేసింది. ఆ ప్రశ్న పెద్దగా పట్టించుకోనట్లు నటిస్తూ, మనమే ప్రశ్నల ద్వారా వాడి సమాచారం రాబడితే బాగుంటుంటుందనుకున్నా. 'మనవాళ్ళెవరైనా కనిపిస్తున్నారా'? అడిగాన్నేను.

ప్రతిస్పందనమొదలైంది.'కనిపించకేం? మొన్న విజయలక్ష్మి కనిపించింది. ఆ అమ్మాయికిప్పుడు ఇద్దరు పిల్లలు, అజయ్ కుమార్ వైజాగ్‌లో ఎం.ఎల్ చదువుతున్నాడు. లక్ష్మీరాజ్యం విశాఖ షిప్‌యార్డ్‌లో పనిచేస్తోంది. సుబ్బారావు మద్రాస్‌లో చార్టెడ్ అకౌంటెంట్, అనూరాధ...' అంటూ మావాడు జాబితా మొదలెట్టి నన్ను మరింత అయోమయంలో పడేశాడు. ఇందులో మూడు పేర్లు స్కూల్లోను, కాలేజిలోను పరిచయమున్నవాళ్ళవి. అయినా వ్యక్తులు వేరు. పైగా మిగిలిన రెండు పేర్లు గుర్తుకు రావడంలేదు. మొత్తానికి ఒక విషయం మాత్రం ధృవ పడింది. తాడికొండ క్లాస్‌మేట్ కాదని. ఎందుకంటే అక్కడ అమ్మాయిలు లేరు గనుక.

అయినా ఇంకా రెండు అవకాశాలున్నాయి. మరోలా ప్రయత్నిద్దామనుకున్నా 'మనక్లాసు లీడరుండే వాడు చూడు.... అంటూ గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు నటించా. ఇలాగైనా ఒక పేరు చెప్పించగలిగితే కనీసం వీడు ఎక్కడిమిత్రుడో తెలుసుకునే అవకాశాలు మెరుగ్గువడ్తతాయనే నమ్మకంతో.

"అదేంటి? అదేమన్నా స్కూలా, క్లాసు లీడర్లు, అసిస్టెంటు లీడర్లు ఉండడానికి? అంటూ ఎద్దేవా చేయడంతో వీడు గంగవరం స్కూల్లో చదవలేదని, చీరాల కాలేజీలో ఇంటర్లోనో, డిగ్రీలోనో నాతోబాటు చదివుంటాడని తేలిపోయింది. నా తొట్రుపాటు కప్పిపుచుకోడానికి వెంటనే "అదేనయ్యా! మన క్లాస్ రిప్రజెంటేటివ్" అన్నాను దబాయింపుగా.

నా మతిమరుపుకు ఆందోళన చెందుతూ నావైపు జాలిగా చూస్తే "నేనున్నప్పుడు ఎలక్షన్లే జరగలేదుగా?" అంటూ గుర్తు చేశాడు. నిజమే ! కాలేజీలో నా డిగ్రీ రెండో సంవత్సరంలో తప్ప ఎలక్షన్లు జరగలేదు. అంటే ఇంటర్మీడియట్ వరకే నాతో చదివుంటాడు అనుకుంటూ, "తర్వాత డిగ్రీ ఎక్కడ చదివావ్?" అని మళ్లీ సంభాషణలోకి నెట్టా. కానీ ఇక్కడ కూడా నాకు ఎదురు దెబ్బే తగిలింది. అదేంటీ, "నేను చదివిందే డిగ్రీ ఫస్టియర్ కదా, నీతో ఆ తర్వాత చదువు మానేశా గదా" అన్నాడు గుర్తు చేస్తూ. వ్యవహారం బెడిసికొడుతోంది.

ఇంతలో మెరవులా ఒక ఆలోచన వచ్చింది. వెంటనే ఆచరణలో పెడుతూ, "సరే, ఆ గొడవలన్నీ ఒదిలేయ్ గానీ, ఇంతకీ నువ్విప్పుడేం చేస్తున్నావ్?" అని అడగ్గానే "ఇదే, ఇక్కడే ఆ ఆయిల్ మిల్లులో" అంటూ కనిపించే ఫ్యాక్టరీ చూపించాడు. ఈ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న నేను "నిన్ను కలుసుకోవాలంటే అక్కడికొచ్చి ఏమని అడగాలి?" అని మావాణ్ణి గాడిలోకి నెట్టే ప్రయత్నం చేశా. ఉహుం! ఇంత పెద్ద ప్లాను కూడా వృధా అయింది. "గేటు దగ్గరకొచ్చి ప్రక్కరూములోకి చూస్తే చాలు నేను కనిపిస్తా" అంటూ అభయం ఇస్తున్నంత ధీమాగా చెప్పాడు. పేరు మాత్రం చెప్పలేదు.

నేరుగా పేరు అడిగేస్తే? ఒక్క క్షణం ఆ ఆలోచన కూడా వచ్చినా, నొచ్చుకుంటాడేమోనని ఆగిపోయాను. ఇంతదాకా మాట్లాడిన తర్వాత నువ్వెవరో గుర్తు రావడం లేదంటే అది మరింత దారుణంగా ఉంటుంది. ఎలా? ఏం చెయ్యాలి? ఆలోచిస్తుండగానే తనే అన్నాడు, "సుభాని మొన్న లెటర్ రాశాడు. వాడిప్పుడు రైల్వేలో పని చేస్తున్నాట్ట."

లాభం లేదు. ఆ పేరు కూడా గుర్తు రావడం లేదు. ఇక బయటపడిపోవడమే మంచిదనిపించింది. "సుభాని ఎవరూ?... గుర్తుకు రావడం లేదే" అన్నాన్నేను.

"సుభాని తెలీదా? వాడే. రోజూ రాయనపాడు నుంచి సైకిల్ మీద వచ్చేవాడు చూడు అంటూ గుర్తు చేశాడు. అంతే! నేనిప్పుడు సుభానిని గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నం చేయలేదు. రాయనపాడు పేరు వినగానే నా మెదడు చకచకా పని చేయడం ప్రారంభించింది. రాయనపాడు నుంచి సైకిల్ మీద వచ్చే వాడంటే కాలేజి విజయవాడలో ఉండి ఉండాలి. నేనక్కడ చదవలేదు. అంటే... ఇతను నన్ను చూసి వాళ్ల మిత్రుడెవరో అనుకుని మాట్లాడుతున్నాడు.

కానీ ఇంతసేపు ఆప్యాయంగా మాట్లాడిన వ్యక్తితో నేను నువ్వనుకుంటున్న నీ మిత్రుణ్ణి కాదని చెపితే అతనెలా ఫీలవుతాడో? అతని ధోరణి చూసి నిజాన్ని కూడా కప్పిపుచ్చాలనిపించింది. వెంటనే అందుకుని "ఓహో! వాడా! అయితే రైల్వేలో చేస్తున్నాడన్న మాట." అంటుండగానే మేం విడిపోవలసిన చౌరస్తా వచ్చేసింది.

"మళ్లీ కలుస్తా! మన వాళ్లెవరైనా కనిపిస్తే అడిగినట్లు చెప్పు" అని చెబుతుంటే నా గొంతు నాకే వింతగా అనిపించింది.

-తోట భావనారాయణ